## క్లుప్తంగా

### వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**దత్తిరాజేరు:** మాఘమాసం ప్రారంభం సందర్భంగా దత్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆల యం లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ప్రధాన అర్చకులు కందాడ హరికృష్ణమాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేయించారు.

### వైభవంగా పరదేశమ్మ తీర్థం



కోలాటం ఆడుతున్న భర్తవానిపాలెం మహిళలు

**వేపాడ:** మండలంలోని చినగుడిపాలలో రెండురోజుల పాటు నిర్వహించనున్న గ్రామదేవత పరదేశమ్మ తీర్థం శనివారం వైభవంగా ప్రారంభమైంది.అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నామని సర్పంచ్ రామునాయుడు, గ్రామపెద్దలు తెలిపారు.

### అభయాంజనేయ ఆలయ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట, హోమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న వేదపండితులు

**లక్కవరపుకోట:** మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు వేదపండితులు సతీష్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో తొలి రోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యావహచనం, కంకనాధారణ, మండపాధారణ, అగ్ని ప్రతిష్ట తదితర పూజలు చేశారు. ఆదివారం విగ్రహ ప్రతి ష్ట చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### మానసిక దివ్యాంగులకు అన్నదానం



దివ్యాంగ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సర్పంచ్ రామస్వామి, తదితరులు

**కొత్తవలస:** స్థానిక కోటపాడు రోడ్డులోని చైతన్య మానసిక దివ్యాంగుల పాఠశాలలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సేవచేయడం అదృష్టంగా భావించాలని అన్నారు. చైతన్య మానసిక దివ్యాంగుల పాఠశాలకు తన వంతు సహకారం అందిస్తానని నిర్వాహకుడు బోజింకి సన్యాసిరావుకు ఆయన మాట ఇచ్చారు.

### జోరుగా ఉపాధి హామీ పనులు



పనులు చేస్తున్న వేతనదారులు

**మెరకముడిదాం:** మండలంలోని ఎం.రావివలసలో ఉపాధిహామీ పనులు కొద్ది రోజులుగా జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని మొగలి చెరువులో రూ.9.76 లక్షలతో పనులను నిర్వహిస్తున్నారు. 33 శ్రమశక్తి సంఘాలకు చెందిన 386 మం ది వేతనదారులు పనులకు హాజరవుతున్నారని క్షేత్రసహాయకుడు పిన్నింటి రాంబాబు చెప్పారు.

### ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

**శృంగవరపుకోట:** నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం భవానీనగర్ గ్రామంలోని డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 464 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 373 మంది హాజరయ్యారని ఎగ్జామినేషన్ అబ్జర్వర్, ఎంఈఓ నరసింహారావు చెప్పారు.పరీక్షల సూపరింటిండెంట్ రఘు, సెంటర్ హెడ్ కె.రమేష్ పర్యవేక్షించారు.

# ప్రత్యేక కార్యాచరణతో నిరంతర అభివృద్ధి

- చీపురుపల్లి మేజర్ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశంలో మంత్రి బొత్స
- పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక శ్రద్ధ
- అవసరమైన పనులను మూడు రోజుల్లో గుర్తించాలి
- రోడ్లు, కాలువల నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన, తదితరులు



హాజరైన వార్డు మెంబర్లు, అధికారులు,నాయకులు

**చీపురుపల్లి:** ప్రత్యేక కార్యాచరణతో చీపురుపల్లి మేజర్ పంచాయతీలో నిరంతరం అభివృద్ధి పనులు, మౌలిక వసతులకల్పన, నిర్వహణ వంటి కార్యక్రమాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయ ణ అధికారులకు సూచించారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ అభివృద్ధిపై అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులతో పట్టణంలోని వైశ్యవర్తక సంఘ భవనంలో శనివారం సమీక్ష నిర్వహించారు. మేజర్ పంచాయతీలోని 20 వార్డుల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు, కాలువలు తదితర అంశాలపై వార్డుల వారీగా సమీక్ష నిర్వహించారు. తాగునీరుకు సంబంధించి పైపులైన్లు, ఇంటింట కుళాయిలు, వాటర్ ట్యాంక్‌లను సంబంధిత అధికారులు, వార్డు మెంబర్లు సంయుక్తంగా పరిశీలించాలని సూచించారు. ఎక్కడెక్కడ పైపు లైన్లు లీకులు ఉన్నాయో, ఎక్కడ వాటర్ ట్యాంక్‌లు అవసరమో గుర్తించా లని ఆదేశించారు. అలాగే ఎక్కడైనా కొత్తగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉందా అనే అంశాలపై పరిశీలన చేసి మూడురోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులకు సూచించారు. తక్షణమే అవసరమైన పనులు చేపట్టేందుకు నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ప్రస్తుతం పారిశుద్ధ్య నిర్వహణ చక్కగా చేస్తున్నప్పటికీ, మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని, ఈడ్రైవ్‌లో అవసర మైతే పారిశుద్ధ్య కార్మికులను బయట నుంచి తెప్పించుకోవాలని, అవసరమైన యంత్రాలు సమకూర్చుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు చెప్పారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ బాధ్యత సచివాలయాల కార్యదర్శుల దేనని, ఎంపీడీఓ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయ తీల్లోని అయిదు సచివాలయాల్లో అభివృద్ధి పనుల కోసం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కోటి రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేపట్టారో నివేదికను సిద్ధం చేయాలని, ఇంకా మిగిలి ఉన్న పనులను సత్వరమే ప్రారంభించి పూర్తి చేసే విధంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యతలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపీడీఓ శ్వేత, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల భవనం, వాటర్ ట్యాంకుల ప్రారంభం



కాటకాపల్లిలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

**కొత్తవలస:** కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలోని శారద మెటల్స్, ఎల్లోయిస్ కర్మాగారం పాత సుంకరపాలెంలో రూ.14 లక్షలతో పాఠశాల భవనం, కంటకాపల్లిలో రూ.16 లక్షలతో 30వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, కాటకాపల్లిలో రూ.14 లక్షలతో 10 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును నిర్మించింది. వీటిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా శారద కర్మాగారం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తుండడం అభినందనీయమన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, భారీ ఎత్తులో పెట్టుబడులను రాష్ట్రానికి రాబట్టారని తెలిపారు. గత ప్రభుత్వంలో అధిక విద్యుత్ చార్జీలతో ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయని గుర్తు చేశారు. సీఎం జగన్ ఎన్నో ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఎంపీటీసీ పరిదేశినాయుడు, సర్పంచ్‌లు మదినా అప్పలరమణ, మచ్చ రామస్వామి, పీతల కృష్ణ, బూసాల దేముడు, నాయకులు పెదిరెడ్ల సూరిబాబు, గొరపల్లి రవికుమార్, శారద కర్మాగారం ప్రతినిధులు ప్రభాత్‌మోహన్, అనంత్ కుమార్, సన్యాసిరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆసరా సంబరాలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, నాయకులు

**దత్తిరాజేరు:** మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు మండలంలోని కోమటిపల్లి రైల్వే గేట్ పక్కన ఉన్న లేఅవుట్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు తెలిపారు. సభావేదిక ఏర్పాట్లను ఆ గ్రామ ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల నుంచి సుమారు 12 వేలు మంది డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరు కానున్నారని ఆయన చెప్పారు. భోజనాలకు ఇబ్బందులు కలగకుండా 25 కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు దత్తి చిరంజీవి, తదితరులు ఎంపీపీ వెంట ఉన్నారు.

## సచివాలయాలు దేవాలయాలతో సమానం

- తెట్టంగి సచివాలయం పరిధిలో రూ.25 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

**గుర్ల:** ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామాల్లోనే అందిస్తున్న సచివాలయాలు దేవాలయాలతో సమానమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారా యణ అన్నారు. మండలంలోని తెట్టంగి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భం గా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను గ్రామాల్లోనే అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పి గాంధీజి కలలుగన్న గ్రామస్వ రాజ్యాన్ని సాకారం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని చెప్పారు. తెట్టంగి సచివాలయం పరిధిలోని తెట్టంగి, పోలాయవలస గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.25 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. పేదింటి పిల్లలు కూడా ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామని, మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా, చేయూత తదితర పథకాలు అమలు చేశామన్నారు.అన్ని వర్గాలకు మంచి చేశామని, రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ఏఅవసరం వచ్చినా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు,సీనియర్ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, సర్పంచ్ జమ్ము పార్వతి, ఎంపీటీసీ జమ్ము రమాదేవి పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలించాం...

- అభివృద్ధి, పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి
- టీడీపీ నేతల మాయమాటలను నమ్మవద్దు
- 'గ్రామసందర్శన' కార్యక్రమానికి గొడికొమ్ములో శ్రీకారంచుట్టిన ఎమ్మెల్యే కడుబండి



గొడికొమ్ము గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

**జామి:** పేదప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టనున్న 'గ్రామ సందర్శన' కార్యక్రమానికి మండలంలోని గొడికొమ్ము గ్రామంలో శనివారం శ్రీకారం చుట్టారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను, సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర పనులను పరిశీలించారు. స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామంలో 145 మందికి సామాజిక పింఛన్ రూపంలో రూ.1.80 కోట్లు రైతు భరోసా పథకం కింద 267 మంది రైతులకు రూ.71.48 లక్షలు, వైఎస్సార్ చేయూత ద్వారా 54 మందికి రూ.29 లక్షలు అందించామని చెప్పారు. అలాగే వాహన మిత్ర పథకం కింద గ్రామంలోని లబ్ధిదారులకు రూ.3.70 లక్షలు, చేదోడు పథకంలో భాగంగా రూ.2.50 లక్షలు, జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా రూ.56.24 లక్షలు, గృహనిర్మాణాలకు బిల్లుల రూపంలో రూ.12 లక్షలు, ఆసరా పథకం ద్వారా రూ.98 లక్షలుఅందించామని వివరించారు. గ్రామంలో రూ.22 లక్షలతో పాఠశాలలో నాడు-నేడు పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, జలజీవన్ మిషన్ పనులు చేశామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడా మీరే గమనించాలని ప్రజలను కోరారు. టీడీపీ పాలనలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎన్నికల సమయం కావడంతో టీడీపీ నాయ కులు గ్రామాల్లోకి వచ్చి బూటకపు హామీలు ఇస్తూ, మాయ మాటలు చెబుతారని, వారిని నమ్మి మోసపోద్దని ప్రజలకు సూచించారు. పార్టీలకతీ తంగా సంక్షేమ పథకాలు అందాలన్నా, అభివృద్ధి కొనసాగాలన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ఆయన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎల్ఈడీ టీవీతో కూడిన ప్రచా ర రథాన్ని ప్రారంభించారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచారక్ గుడివాడ రాజేశ్వరరావు, స్థానిక సర్పంచ్ పిల్లల భవాని, ,వైస్ సర్పంచ్ పిల్లల సింహాద్రి, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పన్నింటి రవికుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

**నేడు బానాదిలో...**

**వేపాడ:** మండలంలోని బానాది గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో 'గ్రామసందర్శన' కార్యక్రమం నిర్వహించను న్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, హాజరు కావాలని కోరారు.

## ఆక్రమణల తొలగింపునకు చర్యలు



హైవేను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమికి హద్దుగా రెవెన్యూ అధికారులు తవ్వించిన కాలువ

**బొండపల్లి:** మండలంలోని బిల్లలవలస గ్రామ జంక్షన్ వద్ద జాతీయ రహదారి-26కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించి, వాటి తొలగింపు చర్యలు చేపట్టారు. రోడ్డు నుంచి ప్రభుత్వ స్థలం వరకు హద్దుగా కాలువను తవ్వించారు. రోడ్డుకు ఎగువన ఉన్న చిన్నబంద నుంచి కిందికి నీరు వెళ్లేందుకు సిమెంట్ పైపులు ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు ఇన్‌చార్జి తహసీల్దార్ హరి, ఆర్ఐ సతీష్ సూచించారు.

## 14న సామూహిక అక్షరాభ్యాసాలు

**శృంగవరపుకోట:** ఋషి పంచమి సందర్భంగా స్థానిక శ్రీరవితేజ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఈనెల 14న సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల డైరెక్టర్ పి.కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8గంటలకు హోమం నిర్వహించి, తర్వాత అక్షర స్వీకార కార్యక్రమం జరిపిస్తారని, కావాల్సిన పూజా ద్రవ్యాలు పాఠశాల యాజమాన్యం సమకూరుస్తుందని పేర్కొన్నారు.

## నేడు బానాదిలో మెగా వైద్యశిబిరం

**వేపాడ:** మండలంలోని బానాది గ్రామంలో అనిల్‌నీరుకొండ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత మెగావైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానికుడు, శిబిరం ఆర్గనైజర్ కండిపల్లి రమేష్ శనివారం తెలిపారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు కిడ్నీ, గుండె, జీర్ణ కోశం, నరాలు, ఎముకులు, కీళ్లు, చెవి,ముక్కు,గొంతు, స్త్రీ సంబంధిత వ్యాధులకు సేవలందిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరం నిర్వహించనున్నామని, గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సారా స్థావరాలపై దాడులు



బెల్లం ఊటను, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న సీఐ చంద్రశేఖర్, తదితరులు

**కొత్తవలస:** మండలంలోని చిన్నమన్నిపాలెం గ్రామ సమీపంలోని తోటల్లో రహస్యంగా నిర్వహిస్తున్న నాటు సారా తయారీ స్థావరాలపై సీఐ వి. చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు దాడులు చేశామని సీఐ తెలిపారు. వేర్వేరు ప్రదేశాల్లో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 10 వేల లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. పోలీసుల అలికిడికి సారా తయారీదారులు అక్కడ నుంచి పరారయ్యారు. దాడుల్లో ఏఎస్ఐలు రాజులు,యువరాజు, కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



శృంగవరపుకోట: అలుగుబిల్లిలో ఉపాధి వేతనదారులకు పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకుడు సూర్యారావు



గజపతినగరం: ఎన్.జి.ఆర్.పురంలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు

**శృంగవరపుకోట:** మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో బీజేపీ నాయకుడు దొడ్డి సూర్యారావు ఆధ్వర్యంలో శనివారం 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వ హించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతాలకు బీజేపీ నాయకులు వెళ్లి వేతన దారులు, గ్రామపెద్దలను కలిసి కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**ఎన్.జి.ఆర్.పురంలో..**

**గజపతినగరం:** మండలంలోని ఎన్.జి.ఆర్.పురం గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఏడు కొండలు ఆధ్వర్యంలో శనివారం 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ నాయకులు వివరించారు. ఈసందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాయకులు మండపాక భారతి, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**బొండపల్లి:** బోడసింగిపేటలోని డివైన్ సేవియర్ స్కూల్ విద్యార్థి ఎం.భార్గవనాయుడు అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడని స్కూల్ కరస్పాండెంట్ రోస్లిన్, ప్రిన్సిపాల్ శాంతి శనివారం తెలిపారు. ఈనెల 3,4 తేదీల్లో విశాఖపట్నం ఫోర్ట్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థి భార్గవనాయుడు ఒక విభాగంలో గోల్డ్ మెడల్, మరో విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడని చెప్పారు. విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

# పోయిన మొబైల్స్ అందజేత



సెల్‌ఫోన్‌లను చూపిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్న బాధితులతో సైబర్‌సెల్ పోలీసులు

**విజయనగరం క్రైమ్:** జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 40 మొబైల్స్‌ను ట్రేస్ చేసి వాటిని బాధతులకు అందజేశారు. శనివారం స్థానిక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన పంపిణీ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ టీవీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, పోయిన మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు సైబర్ పోలీసులు, సిబ్బంది నిరంతరం పని చేస్తుంటారని చెప్పారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ల గురించి ఫిర్యాదు చేసిన కొద్ది రోజుల్లోనే 40 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్స్‌పై ఫిర్యాదులను సీఈఐఆర్.జీఓవీ.ఇన్ ఆన్‌లైన్ ద్వారా గాని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో గాని తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్సైలు ప్రశాంత్‌కుమార్, నజీమా బేగం, కానిస్టేబుళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా సీతారాముల కల్యాణం



శ్రీరామకల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

**విజయనగరం టౌన్:** నగరంలోని రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం రామాయణ పారాయణం, నక్షత్ర హోమం చేశారు. అనంతరం సుందరకాండ పారాయణం చేశారు. మధ్యాహ్నం వేడుకగా శ్రీరామ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసా సేవా సంఘ అధ్యక్షుడు పిళ్లా విజయ్‌కుమార్, కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.